క్లుప్తంగా

బరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



పల్లకీ సేవా నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామికి అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి గణపతి పూజ, కుంకుమార్చన, పుష్పార్చన, జలాభిషేకం, ఆకుపూజ, మన్యసూక్త హోమం, పల్లకీ సేవా తదితర విశేష పూజలను వేదపండితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో జరిపించారు. స్వామివార్లను పల్లకీలో ఆశీనులను చేసి మేళతాళతో ఆలయం చుట్టూ పదక్షిణలు చేయించారు. భక్తులకు మిడుతూరు గ్రామానికి చెందిన తువ్వ రామిరెడ్డి, సీతమ్మ గార్ల జ్ఞాపకార్థం తువ్వ సోదరుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పేరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పర్వత యుగంధర్ రెడ్డి, రోళ్లపాడు మాజీ సర్పంచ్ పేరెడ్డి వెంకటరామిరెడ్డి, బరక సంజీవరాయ స్వామికి ప్రత్యేక పూజలు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తువ్వా రవీంద్రనాథరెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి, తువ్వా వెంకటనాగిరెడ్డి, తువ్వా రామనాగేశ్వరరెడ్డి, తువ్వా అయ్యపురెడ్డి, నాగలూటి సర్పంచ్ ఉషారాణి, సింగిల్ విండో చైర్మన్ నాగతులసిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

నందికొట్కూరు రూరల్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్ర నాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను గురించి ప్రజలకు వివరించారు.

కౌలురైతు అవగాహన సదస్సు



కౌలురైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని ఆత్మకూరు అర్బన్ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం కౌలు రైతు అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ఆత్మకు అర్బన్ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ షేక్ బైరాపురం మహబూబ్ బాషా మాట్లాడుతూ పొలం కౌలు తీసుకొని సాగు చేస్తున్న వారు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రం తీసుకోవాలని సూచించారు. సీసీ ఆర్సీ కార్డు ఉంటే డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా, పంట నమోదు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం అధ్యక్షుడు తపాలా అష్రఫ్‌అలీ, గ్రామ రెవెన్యూ అధికారి నాగరాజు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు

పారుమంచాల-లింగాపురం రోడ్డు పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న డీఈ, ఏఈ, సర్పంచ్

జూపాడుబంగ్లా: పారుమంచాల-లింగాపురం రోడ్డు నిర్మాణం నిమిత్తం పీఐయూ డీఈ లక్ష్మీనారాయణ, ఏడబ్ల్యూఈ నారాయణరెడ్డి, సర్పంచ్ నాగార్జునరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల నంద్యాలకు వెళ్లాలనుకునే తరిగోపుల, పి.లింగాపురం,80 బన్నూరు గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గుతుందని సర్పంచ్ అధికారులకు వివరించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణ కాలుష్యం



ప్లాస్టిక్ ముప్పుపై విద్యార్థులకు వివరిస్తున్న అటవీ అధికారులు.

శ్రీశైలంప్రాజెక్ట్: ప్లాస్టిక్ వాడకం నిత్యం పెరిగిపోతుండడం వలన పర్యావరం కలుషితమవుతోందని అటవీ అధికారులు తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న మిషన్ లైఫ్‌స్టైల్ లో భాగంగా శుక్రవారం ప్రతిభా పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేరిసలోమి, అటవీ అధికారులు మధన్‌కుమార్, సలాంఅల్లా, భీమానాయక్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో జీవనోపాధి మెరుగు

- వేసవిలో వలస వెళ్లకుండా స్థానికంగానే పనులు
- గ్రామాలలో వేల కుటుంబాలకు పనుల కల్పన
- లక్ష్యానికి మించి ఉపాధి పనులు



గువ్వలకుంట్ల సమీపంలో చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కొత్తపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామాలలో ప్రజలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నారు. మండలంలో ఈ పనులు అన్ని గ్రామాలలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనుల కల్పనతో ప్రజలకు ఊతం దొరికినట్లు అయింది. వెసవిలో ప్రజలు వలసలు వెళ్లకుండా గ్రామాలలోనే జీవనోపాధి మెరుగుపరచే విధంగా పనులు సాగుతున్నాయి. దీంతో మండలంలో వేలసంఖ్యలో పనులకు హాజరవుతున్నారు. ఈ మేరకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యానికి మించి పనులు కల్పించారు. దినికితోడుగా పనుల్లో అవినీతికి చోటులేకుండా చేసేందుకు ఎన్ఎంఎంఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది.

ఏప్రిల్ నెలలో 97 శాతం పనులు

మండలంలో 7374 జాబుకార్డులకు 14,766 మంది పనులు చేసుకునేందుకు వీలుకలుగుతోంది. ఇందులో ప్రస్తుతం 5,922 కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నారు. సుమారు 11,418 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 2022-2023 ఆర్థిక సంవత్సరానికి 2,47,948 పనిదినాలు కల్పించాల్సి ఉండగా 2,86,542 పనిదినాలు కల్పించి 116 శాతం పనులు అధికారులు పనులు పూర్తిచేశారు. 2022-23 సంవత్సరంలో మండలంలో 100 రోజులు పని 42 కుటుంబాలు, 99 రోజుల పనిదినాలు 1880 కుటుంబాలు, 98 రోజుల పనిదినాలు 2,100 కుటుంబాలు పూర్తిచేసుకున్నాయి. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి 2,78,347 పనిదినాలను కల్పించాలని ప్రభుత్వం టార్గెట్ ఇవ్వగా.. ఇందులో ఏప్రిల్ నెలకు 73,149 పనిదినాలు కల్పించి 97 శాతం పనులు పూర్తిచేశారు.

నూతన విధానంతో అక్రమాలకు చెక్

ఉపాధి పనుల్లో అవినీతికి చోటులేకుండా చేసేందుకు ఎన్ఎంఎంఎస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా పనులు చేస్తున్న సమయంలో ఉదయం ఒక ఫొటో, నాలుగు గంటల తర్వాత రెండవ సారి తీయడం ద్వారా అవినీతికి చోటులేకుండా పనులు కల్పించేందుకు తొడ్పాటు నిస్తుంది. అలాగే కూలీలకు రోజువారీ వేతనం రూ.275 వచ్చివిధంగా అధికారులు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా కొలతలు ఇచ్చి పనులు చూపుతున్నారు.

అడిగిన ప్రతిఒక్కరికి పని



మండలంలో 12 గ్రామ పంచాయతీలలో 32 గ్రామాలు ఉన్నాయి. వేల కుటుంబాలు ప్రతి రోజు పనులకు హాజరవుతున్నాయి. అడిగిన ప్రతి వారికి వెంటనే పనులు కల్పిస్తున్నాం. ఎవరూ వేరే చోటికి పనులకు వెళ్లకుండా గ్రామాల్లోనే ఉపాధి కల్పిస్తున్నాం.
– ఏపీఓ రాజు నాయక్, కొత్తపల్లి

కొత్త విధానం బాగుంది



ఉపాధి పనుల్లో ఎన్ఎంఎంఎస్ అనే కొత్త విధానం చాలా బాగుంది. రెండుసార్లు పని ప్రదేశంలో ఫొటో తీస్తున్నారు. గతంలో మస్టర్‌లో సంతాలతో అక్రమాలు చేసేందుకు సులువుగా ఉండేది. ఈ విధానం ద్వారా అక్రమాలకు పాల్పడకుండా ఉంది. పనికి వస్తేనే కూలి అందుతుంది.
– శేషన్న, ఉపాధికూలీ, గువ్వలకుంట్ల

వేతనం పెరిగింది



గతంలో ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తే రూ.100 నుంచి రూ.150 లోపు వేసేవారు. ఎంతపనిచేసిన అంతే వచ్చేది. ఇప్పుడు కొలతల ప్రకారం పనులు కల్పిస్తున్నారు. కూలీ రూ.240 దాకా వస్తుంది. ఇంతకు మునుపుతో పోలిస్తే చాలా ఆనందగా ఉంది. – లక్ష్మీకాంతమ్మ, ఉపాధికూలీ, మునలిమడుగు గ్రామం

కృష్ణానదిపై అలుగు నిర్మించాలి

మహానంది: కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి స్థానంలో అలుగును నిర్మిస్తే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు భాస్కర్‌రెడ్డి, పట్నం రాముడు డిమాండ్ చేశారు. తమ్మడపల్లె గ్రామంలో శుక్రవారం సిద్ధేశ్వర జలజాగరణ దీక్ష పోస్టర్లను విడుదల చేశారు. సిద్ధేశ్వర అలుగు శంఖుస్థాపన వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31న చేపట్టనున్న సిద్ధేశ్వర జలజాగరణ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మహానంది ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శివయ్య, నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఘర్షణ

మహానంది: గాజులపల్లె గ్రామానికి చెందిన మహిళల మధ్య వాగ్వాదం ఘర్షణకు దారి తీసింది. గ్రామంలోని ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగించే సావిత్రి, మరో ఇద్దరు మధులత, విజయమ్మల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో ఇద్దరు సావిత్రిపై దాడి చేయగా ఆమెకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయంపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ తెలిపారు.

నేడు వలంటీర్లకు సన్మానం

జూపాడుబంగ్లా: మండలంలోని పారుమంచాల గ్రామంలో శనివారం ఎమ్మెల్యే చేతులమీదుగా పారుమంచాల, తూడిచెర్ల గ్రామంలోని వలంటీర్లను సన్మానించనున్నట్లు ఎంపీడీఓ మంజులవాణి తెలిపారు. మండలంలోని ఐదుగురు వలంటీర్లకు సేవారత్న, 170మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు వచ్చినట్లు వెల్లడించారు.

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- బండిఆత్మకూరులో 102వ రోజుకు చేరిన 'గడప గడపకు మనప్రభుత్వం'



బండిఆత్మకూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: అమ్మా...ఈ పథకాలు ఎవరిచ్చారు.. ఇంకెవరూ సార్ మా జగన్ సారే అంటూ ఒకరు... మళ్లీ ఓటెవరికి వేస్తారంటే మా ఓటు జగనన్నకే అంటూ మరొకరు...ఇలా ప్రతి గడపలో సంక్షేమ పథకాలు అందుకున్న పేద ప్రజల ఆనందం వ్యక్తపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం బండిఆత్మకూరులో 102వ రోజుకు చేరింది. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఇంటింటికీ తిరిగి పేదలకు అందిన సంక్షేమ పథకాల వివరాలు అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. పెద్దమ్మా...మీకు ఇంత అమౌంట్ పడింది, ఎవరిచ్చారు అంటే మా జగన్‌బాబు అంటూ సంతోషంగా చెప్పడం చూస్తే పేద ప్రజల గుండెల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ఆదరణ తెలుస్తోందంటూ ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సంక్షేమ రాజ్యాన్ని స్థాపించిన సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం

గ్రామంలో ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శ్రీకృష్ణ మందిరం, డప్పు కళాకారుల కార్యాలయాలకు స్థలం కేటాయించాలని కోరగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా ఎనిమిదవ వార్డు మెంబర్ పొడవ బాలస్వామి కేక్ కట్ చేసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, బండిఆత్మకూరు సర్పంచ్ సిరిమాను సంధ్య, పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ సుజాతమ్మ, ఎంపీటీసీలు ముంతల మధురాణి, పుల్లయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ చిన్నసుబ్బారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి(బాబురెడ్డి), దీపకాంత్‌రెడ్డి, కాకనూరు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఏ కోడూరు ఉప సర్పంచ్ శ్రీరాంరెడ్డి, సీమ వెంకటసుబ్బారెడ్డి, ఇటికెల చరణ్‌రెడ్డి, శిరోమణమ్మ పాల్గొన్నారు.

నేడు బండిఆత్మకూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

బండిఆత్మకూరు మండల కేంద్రంలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాలుగవ రోజు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఉదయం ఎరుకలకాలనీలో కార్యక్రమం అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు సన్మానం ఉంటుందన్నారు. సాయంత్రం వీవర్స్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగిస్తారన్నారు.

పేదలను కించపరచడం చంద్రబాబుకు తగదు



సంక్షేమ పథకాలను లబ్ధిదారునికి వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

- కట్టుకున్న ఇళ్లను సమాధులుగా పోల్చటం సిగ్గుచేటు
- ముదుపులిచ్చిన వారికే స్థలాలిచ్చిన నీచ చరిత్ర నీదంటూ విమర్శ
- ప్రజాసంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన
- పారుమంచాలలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

జూపాడుబంగ్లా: వయోభారంతో ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ విమర్శించారు. శుక్రవారం మండలంలోని పారుమంచాల గ్రామంలో సర్పంచ్ మాధవరం ప్రకాశం అధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వారికి మంజూరు చేసిన సంక్షేమ పథకాల లబ్ధివివరాల బుక్‌లెట్‌ను అందజేసి వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోటవీధిలో తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని, ఇళ్లు, నూతన పింఛన్లు మంజూరు చేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే కొంత మంది తమకు వస్తున్న పింఛన్లు పలుకారణాల వల్ల నిలిపివేశారని వాటిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యేను కోరారు. ప్రజల సమస్యలను ఆలకించిన ఎమ్మెల్యే సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని భరోసా నిచ్చారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా ఇళ్ల స్థలాలు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలసంక్షేమమే ధ్యేయం ఇంటిస్థలాలిచ్చి, ఇళ్లు మంజూరు చేసి వారికి గూడు వసతిని కల్పిస్తుంటే వాటిని చూసి కండుమంటతో చంద్రబాబు నాయుడు నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్యే అన్నారు. ఎలాంటి రెకమెండేషన్, పైసా ఖర్చులేకుండా గ్రామాల్లోని పేదలకు జగనన్నకాలనీల్లో 1.50సెంటు, పట్టణాల్లో సెంటు స్థలాన్నిచ్చి ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేదలు రెక్కలు ముక్కలు చేసుకొని అందంగా నిర్మించుకుంటున్న ఇళ్లను చంద్రబాబునాయుడు సమాధులతో పోల్చడం, పేద ప్రజలను కించపరిచేలా మాట్లాడటం అతని నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆయన పాలనలో టిడ్కో అంటూ ఐదారుఫ్లోర్లలో కట్టించిన ఇళ్లు ఎన్ని సెంట్లు ఉన్నాయో వెల్లడించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరం ప్రకాశం, ఎంపీపీ సువర్ణమ్మ, జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు, తూడిచెర్ల సర్పంచ్ బాలమద్దిలేటి, సొసైటీ చైర్మన్లు ఈదుల నారాయణరెడ్డి, హుసేనయ్య, శివారెడ్డి, దేవసహాయం, ధొక్కారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగాలపెద్దన్న, ఉస్మాన్ బాషా, కృష్ణారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు: ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఓ వరమని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ స్పష్టం చేశారు. కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి చెందిన తిరుపాటి న్యామతుల్లా వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 3 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి ఈ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, మండల కన్వీనర్ జీఎండీ రఫి తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం



ఆత్మకూరులో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

వెలుగోడు: కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.యేసు రత్నం పిలుపునిచ్చారు. సుందరయ్య 38వ వర్ధంతి సభను పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి యేసురత్నంతో పాటు కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కే రామదాసు, సీఐటీయూ మండల నాయకులు శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ, ఎస్ బాషా, వెంకటయ్య తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కష్ణ, ఇస్మాయిల్, పక్కీరయ్య, ఆంజనేయులు, భాస్కర్, నూరుల్లా, కరిముల్లా, ఖాదర్ వలీ పాల్గొన్నారు.

ఆదర్శ ప్రజాప్రతినిధి పుచ్చలపల్లి

ఆత్మకూరు: దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, ఆదర్శ ప్రజాప్రతినిధిగా దేశంలోనే ఆదర్శంగా నిలిచిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటితరం వారు ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్ అన్నారు. శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని డాక్టర్ ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంజుల, మీనాక్షమ్మ, ఎం.రజాక్, ఎన్.స్వాములు, డి. రామ్ నాయక్, షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సున్నిపెంటలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నమారెన్న, నాగసైదయ్య, నాగరాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలు సాధిద్దాం

నందికొట్కూరు : సుందరయ్య ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సభను నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఫక్కీర్‌సాహెబ్, ప్రజా సంఘాల నాయకుడు బెస్తరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంజిన్‌బోటు నిర్వాహకులపై కేసు నమోదు

పగిడ్యాల: కృష్ణానదిలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇంజిన్ బోటు నడుపుతున్న నిర్వాహకులు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున శుక్రవారం తెలిపారు. స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ సమీపాన ఉండే మూర్వకొండ ఘాట్ నుంచి కృష్ణానదిలో ఇంజిన్ బోట్లు నడిపి తెలంగాణ రాష్ట్రం మంచాలకట్టకు ప్రయాణికులను తరలిస్తున్నారని వెల్లడించారు. మూర్వకొండ ఘాట్ నిర్వాహకులు జటప్రోలు వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, మరోకరిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మట్టి తవ్వకాలను ఆపాలి

మహానంది: బసాపురం సమీపంలో ఎర్రమట్టి తవ్వకాలతో రైతుల పంట పొలాలు నాశనమవుతున్నాయని, అధికారులు స్పందించి మట్టి తవ్వకాలను ఆపాలని సీపీఎం జిల్లా నాయకులు నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అరటి, మొక్కజొన్న, పసుపు తదితర పంటలను సాగు చేసే పొలాల వద్ద ఎర్రమట్టి తవ్వకాలు నిత్యం జరుపుతున్నారని అన్నారు. దీని ద్వారా పొలాల్లోని పంట దిగుబడులు మట్టి కొట్టుకుపోతున్నాయన్నారు. అధికారులకు ఎన్ని పర్యాయాలు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నిబంధనల మేరకు ఉపాధి పనులు చేపట్టండి

మిడుతూరు: పని ప్రదేశానికి కూలీలు త్వరగా చేరుకొని ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కడుమూరులో ఉపాధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పని ప్రదేశానికి త్వరగా చేరుకోవాలని, నిబంధనల మేరకు పనులు చేస్తే సరైన వేతనం వస్తుందని చెప్పారు. ఎండ తీంరత అధికంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలకు తావివ్వొద్దు

జూపాడుబంగ్లా: ఉపాధిపనుల్లో అక్రమాలకు తావులేకుండా పనులు చేయించాలని ఎంపీడీఓ మంజులవాణి ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని మండ్లెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. మస్టర్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీఏ సబిత, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

కొత్తపల్లి:కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలని సామాజిక తనిఖీ డీఆర్పీ గంగప్ప తెలిపారు. శుక్రవారం సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ పరిధిలో ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కల్యాణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ముగ్గురు మహిళా దొంగల అరెస్ట్

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రయాణికుల బ్యాగులు దొంగిలించే ముగ్గురు మహిళా దొంగలను శుక్రవారం టూటౌన్ ఎస్ఐ గంగయ్యయాదవ్ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఎస్ఐ గంగయ్యయాదవ్ తెలిపిన వివరాల మేరకు సున్నిపెంటకు చెందిన పి.నాగజ్యోతి గత 13న దోర్నాల నుంచి సున్నిపెంటకు ఆర్టీసీ బస్సులో వచ్చి దిగుతుండగా తన బ్యాగును దొంగిలించారని, అందులో రూ.31,500 నగదు ఒక ఎటిఎం కార్డు ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే 16న ఎం.శిరీష విశాఖపట్నం నుంచి సున్నిపెంటకు వస్తుండగా ఆమె బ్యాగులో ఉన్న 31.123 తులాల బంగారు నగలను దొంగిలించారని ఫిర్యాదు చేశారు. బస్టాండ్‌లోని సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించడంతో పాటు కచ్చితమైన సమాచారం మేరకు నంద్యాల వైఎస్ఆర్ నగర్‌కు చెందిన నగనూరి.ఉషాకుమారితోపాటు రాజమండ్రికి చెందిన రావుల లక్ష్మి, తొండ పోశమ్మలను లింగాలగట్టు బ్రిడ్జి వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దొంగల వద్ద నుండి నగదు, బంగారాన్ని రికవరీ చేసి ముద్దాయిలను ఆత్మకూరు కోర్టులో హాజరు పరిచినట్లు వెల్లడించారు. వీరు ముగ్గురు జట్టుగా ఏర్పడి నంద్యాల, కర్నూలు, ప్రకాశం, రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లాలో పలు నేరాలకు పాల్పడినట్లు తెలిపారు.

22 నుంచి వలంటీర్ల సన్మాన కార్యక్రమాలు

మిడుతూరు: మండలంలోని 14 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లకు ఈ నెల 22 నుంచి జూన్ 2వ తేదీ వరకు సచివాలయాల వారీగా ప్రశంసా పత్రాలు, సన్మాన కార్యక్రమం నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమం షెడ్యూల్‌ను విడుదల చేశారు. 22న సాయంత్రం 4 గంటలకు మిడుతూరు-1, మిడుతూరు-2 సచివాలయ వలంటీర్లకు, 23న ఉదయం 11 గంటలకు చింతలపల్లి సచివాలయం, సాయంత్రం 4 గంటలకు దేవనూరు, 24న ఉదయం 11 గంటలకు కడుమూరు, సాయంత్రం 4 గంటలకు మాసపేట వలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. 25న ఉదయం 11 గంటలకు చౌట్కూరు, సాయంత్రం 4 గంటలకు నాగలూటి, 26న ఉదయం 11 గంటలకు తిమ్మాపురం, సాయంత్రం చెరుకుచెర్ల వలంటీర్లకు, 30న ఉదయం 11 గంటలకు జలకనూరు, సాయంత్రం 4 గంటలకు వీపనగండ్ల, 2న ఉదయం 11 గంటలకు తలముడిపి, సాయంత్రం 4 గంటలకు అలగనూరు వలంటీర్లకు సన్మాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శేషుబాబు

కొత్తపల్లి: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని హౌసింగ్ పీడీ శేషుబాబు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఇళ్లనిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలలో ప్రస్తుతం నిర్మాణాలు బేస్‌మెట్ లెవల్‌లో ఉన్నాయన్నారు. నిర్మాణాలు చేసుకునేందుకు ఇసుక, సిమెంట్ ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. 15 రోజులకోసారి నిర్మాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయించాలని చెప్పారు. అనంతరం మండలకేంద్రంలోని జగనన్న కాలనీని సందర్శించి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ప్రభాకర్, ఎంపీడీఓ మేరి, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు

ఉత్తమ వలంటీర్లకు సత్కారం



వలంటీర్లును సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ కిషోర్

నందికొట్కూరు: సంక్షేమ పథకాల సారథులు వలంటీర్లు అని మున్సిపల్ కమిషనర్ కిషోర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర ఉత్తమ సేవ అవార్డులు కమిషనర్, కౌన్సిలర్లు మూలింటి లక్ష్మిదేవి, జాకీర్ హుసేన్ అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ 254 మంది వలంటీర్లుకు గాను 207 మంది అవార్డులకు ఎంపికయ్యారన్నారు. సేవా వజ్ర పథకానికి ఒకరు, సేవా రత్న పథకానికి ఐదుగురు, సేవా మిత్ర పథకానికి 201 మంది వలంటీర్లును ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అత్యుత్తమ సేవతో ప్రజలకు అందించిన ఉత్తమ వలంటీర్లుకు సేవ వజ్ర కేటగిరీ చెందిన వారికి సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జి, మెడల్‌తో పాటు నగదు రూ.30 వేలు నగదు అందించామన్నారు. సేవ రత్న కేటగిరిలో ఎంపికై వలంటీర్లుకు సర్టిఫికెట్‌తో పాటు బ్యాడ్జి, శాలువా, మెడల్, రూ. 20 వేలు నగదు, మిగత వారికి సేవా మిత్ర కేటగిరిలో ఎంపికైన వారిని సన్మానించడం జరిగిందన్నారు.